## రైతుల కష్టం తెలియని కాంగ్రెస్..



పాలకుర్తి, నవంబర్ 24 : రైతుల కష్టం తెలియకుండా కాంగ్రెస్ వాళ్లు ఏదేదో మాట్లాడుతున్నారు. వాళ్లు అంటున్నట్లు మూడు గంటల కరెంట్ ఇస్తే వ్యవసాయం చేయడం కష్టంగా ఉంటుంది. నాకు ఉన్న ఐదు ఎకరాల్లో వరి ఇతర పంటలు సాగు చేస్తున్నాను. తెలంగాణ వచ్చాక కరెంట్ కష్టాలు తప్పాయి. సాగుకు 24గంటల ఉచిత కరెంట్ అందిస్తున్నది సీఎం కేసీఆర్ సార్. రైతు బంధు ఇచ్చి రుణమాఫీ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే రూ.5లక్షల బీమా ఇస్తున్నారు. మూడు గంటల కరెంట్‌తో రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తుంది. చీకట్లో బావుల వద్దకు వెళ్లి విషపురుగుల బాధల మధ్య బిక్కుబిక్కుమంటూ కాలం వెలిబుచ్చాలి. 10హెచ్‌పీ మోటర్లు పెడితే అంత ఖర్చు రైతులు భరించలేం. రైతులు ఆగమయ్యే రోజులు మళ్లీ వస్తాయి.

*- బానోత్ బిచ్చ, రైతు, హాట్యతండా, పాలకుర్తి*

## ధరణితోనే రైతులకు లాభం



పాలకుర్తి రూరల్ : ధరణితోనే రైతులకు లాభం జరుగుతోంది. కాంగ్రెస్ పాలనలో పటేల్ పట్వారీ వ్యవస్థ ఉండేది. నాడు ఎన్‌టీఆర్ పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు చేస్తే నేడు సీఎం కేసీఆర్ రైతులను ఇబ్బంది పెడుతున్న వీఆర్వోల వ్యవస్థ రద్దు చేసిండు. కాంగ్రెస్ పాలనలో ఒకరి భూమి ఒకరికి పహాణీల్లో రాసేటోళ్లు. భూమి ఓ దగ్గర సర్వే నంబర్ మరో దగ్గర ఉండేది. దాన్ని సరి చేయాలంటే రైతుల నుంచి డబ్బులు వసూలు చేసి మళ్లీ ఎక్కించేవాళ్లు. రైతులు నానా తిప్పలు పడేది. ఇప్పుడు ధరణితో ఆ ఇబ్బందులు అన్నీ తొలగిపోయాయి. రైతులు కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు. రైతుల కష్టాలు, కన్నీళ్లు తుడిచిన మహానుబావుడు కేసీఆర్. మళ్లీ సీఎం కేసీఆర్ రావాలి.

*- గుగులోత్ వాసునాయక్, రైతు, దుబ్బ తండా*





ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న ఉషాదయాకర్‌రావు

## ‘ఎర్రబెల్లి’తోనే పాలకుర్తిలో అభివృద్ధి

**ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు**

పాలకుర్తి నవంబర్ 24 : మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలోనే పాలకుర్తి నియోజకవర్గంలో సమగ్రాభివృద్ధి జరిగిందని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తిలోని పార్టీ కార్యాలయంలో ఉషాదయాకర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నాయకులు చిరుపాటి ఎల్లస్వామి, రాజు, జగన్‌రావు బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కారుగుర్తుకు ఓటేసి ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## గెలుపు దేవుడెరుగు..ఓడితే ఇక్కడే ఉంటారా..?

- **ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినీరెడ్డి**
- **బీఆర్‌ఎస్ నాయకుడు అల్లం ప్రదీప్‌రెడ్డి**



అల్లం ప్రదీప్‌రెడ్డి

దేవరుప్పుల, నవంబర్ 24 : పాలకుర్తి ఎమ్మెల్యేగా గెలిస్తే సేవ చేస్తానని చెబుతున్న కాంగ్రెస్ అభ్యర్థి యశస్విని ఓడితే ఆమెరికా ఉడాయిస్తారా ఇక్కడే ఉండి ప్రజలకు సేవలందిస్తారా తెలిపితే సంతోషిస్తామని బీఆర్‌ఎస్ నాయకుడు అల్లం ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ పౌరసత్వం లేని ఝాన్సీరెడ్డి పాలకుర్తి టికెట్ నాకే అని కాంగ్రెస్ శ్రేణులను మభ్యపెట్టి, కోడలుకు టికెట్ ఇప్పించుకుని, కాంగ్రెస్ పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడుతున్న వారికి మొండి చేయి చూపించారన్నారు. ఝాన్సీరెడ్డి నియంతృత్వ పోకడలు నచ్చక తామంతా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశామని, మరోవైపు రేవంత్‌రెడ్డి రేటెంతరెడ్డిగా మారి డబ్బులు దండుకుని టికెట్లు అమ్ముకున్నారని ప్రదీప్‌రెడ్డి ఆరోపించారు. సంఘ సేవ చేయాలనే సంకల్పం ఝాన్సీరెడ్డికి ఉంటే తాను దళితులు, అణగారిన వర్గాల వద్ద అడ్డికి పావుసేరుకు కొన్న భూములను తిరిగి వారికి ధారాదత్తం చేయాలన్నారు. అప్పుడే సేవకులని ప్రజలు నమ్ముతారన్నారు. గత 15ఏళ్లుగా నియోజకవర్గమే సొంత ఇంటిగా భావించి అనేక అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించిన దయన్న గెలుపు ఖాయమన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న కుక్కల విక్రమ్‌కుమార్

రాయపర్తి, నవంబర్ 24 : సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల సౌలభ్యం కోసం భారత, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా 54మంది దరఖాస్తులు చేసుకున్నారు. శుక్రవారం మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు కుక్కల విక్రమ్‌కుమార్ ఇంటి వద్దకు పోలింగ్ అధికారుల బృందం వెళ్లగా ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నాడు.

# పడావు భూముల్లో పసిడి పంటలు

- **వలసవాదుల పాలనలో వివక్షకు గురైన తెలంగాణ**
- **స్వరాష్ట్రంలో బంగారు తెలంగాణ దిశగా పయనం**
- **కోనసీమగా రాయపర్తి మండలం**
- **అభివృద్ధికి పట్టం కట్టాలి..**
- **మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**
- **పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం**



రాయపర్తి ప్రచార ర్యాలీలో గొల్ల కుర్మల డోలు వాయిస్తున్న మంత్రి దయాకర్‌రావు

రాయపర్తి, నవంబర్ 24 : తెలంగాణ రాష్ట్రంలోని పడావుపడ్డ భూముల్లో ఇప్పుడిప్పుడే సీఎం కేసీఆర్ దార్శనికత కారణంగా పసిడి పంటలు పండించుకుంటున్నామని బీఆర్‌ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖామాత్యులు ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని తెట్టె కుంటతండా, తిర్మలాయపల్లి, రాయపర్తి, గన్నారం, కొండూరు, బురహాన్‌పల్లి, కాట్రపల్లి, కిష్టాపురం, మొరిపిరాల, మహబూబ్‌నగర్ గ్రామాల్లో బుల్లితెర ఆర్టిస్టలు, రేలారేరేలా ఫేమ్ గంగ, ఫోక్ సింగర్ గొట్టె కనకవ్వ, జబర్దస్త్ ఆర్టిస్ట్ రాజమౌళి, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చేరుకున్న మంత్రి ఎర్రబెల్లి బృందానికి గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు, ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధుల సారథ్యంలో డప్పుచప్పుళ్లు, మంగళవాయిద్యాలు, మహిళల కోలాటాలు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు, బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో మంత్రి ఎర్రబెల్లి కాలినడకన తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం నిర్వహించిన ప్రచార సభల్లో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సీమాంధ్ర పాలకుల వివక్షకు గురై అభివృద్ధిలో అట్టడుగున ఉండిపోయిందన్నారు. సాగునీరు లేక పడావుపడి భూముల్లో పల్లేర్లు మొలిచాయన్నారు. దీంతో ప్రజలు పొట్ట చేతపట్టుకుని పట్టణాలకు వలస వెళ్లారన్నారు. నేడు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతోందన్నారు. కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణం, ఎస్సారెస్పీ కాలువల ద్వారా అందుతున్న సాగు నీటితో మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయని తెలిపారు. భూగర్భ జలాలు పుష్కలంగా పెరిగాయన్నారు. దీంతో గ్రామాలు పచ్చని పంటలతో కోనసీమను తలపిస్తున్నట్లు ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ పాలనే సంపూర్ణ రక్షణ అని చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ బంగారు తెలంగాణ దిశగా పయనిస్తోందని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెబుతున్న మోసపూరిత మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆయన కోరారు. అనంతరం మండలంలోని తిర్మలాయపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయం, కొండూరులోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు.

### జర్నలిస్ట్ రవీందర్ కుటుంబాన్ని ఆదుకుంటా..

మండల కేంద్రంలో ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందిన మండల సీనియర్ జర్నలిస్ట్ వలబోజు ర వీందర్ కుటుంబాన్ని మంత్రి ఎర్రబెల్లి కలిసి పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జి నుగు అనిమిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్ల సుధీర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ఆకు ల సురేందర్‌రావు, మండల నాయకులు గుడిపూడి గోపాల్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, సర్పంచులు, ఎంపీటీసీలు గారె నర్సయ్య, అయిత రాంచందర్, బిల్ల రాధిక సుభాష్‌రెడ్డి, గజవెల్లి అనంత ప్రసాద్, కర్ర సరితారవీందర్‌రెడ్డి, చిర్ర ఉపేంద్ర, కుక్కల భాస్కర్, సూదుల దేవేందర్‌రావు, బోనగిరి ఎల్లయ్య, సంకినేని ఉప్పలమ్మ, అంబ్రెడ్డి యాదమ్మ, గాదె హేమలతారవీందర్‌రెడ్డి, భూక్యా క్రాంతి, చిక్కొండ రజితావీరస్వామి, మహ్మద్ నయీం, వనజారాణి, మహ్మద్ అక్బర్, ముద్రబోయిన సుధాకర్, చందు రామ్‌యాదవ్, పాల్వంచ కోటేశ్వర్, తౌడిశెట్టి రామారావు, పురం అనిల్‌కుమార్, చిన్నాల ఉప్పలయ్య, బందెల బాలరాజు, జక్కుల వెంకట్‌రెడ్డి, గట్టు నర్సింహాచార్యులు, ఉబ్బని సింహాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు : తొర్రూరు మండలం వెలికట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోమల్ల దామోదర్‌రావు కాంగ్రెస్ పార్టీకిరాజీనామా చేసి శుక్రవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో చేరారు. అలాగే తొర్రూరు పట్టణానికి చెందిన వివిధ కులాలకు చెందిన 50మందికి పైగా మహిళలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

## ‘ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉంది’



ప్రచారం చేస్తున్న సర్పంచ్ మంజుల, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

పెద్దవంగర, నవంబర్ 24 : ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉందని, మంత్రి దయాకర్‌రావు అధిక మెజార్టీతో గెలవడం ఖాయమని సర్పంచ్ సల్దెండి మంజుల అన్నారు. శుక్రవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో స్థానిక బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటా ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటేసి మంత్రి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు.

### అమాత్యుడి గెలుపు కోరుతూ

## అయ్యప్పల పూజలు

రాయపర్తి, నవంబర్ 24 : ఈ నెల 30న జరుగనున్న ఎన్నికలలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అఖండ మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ విస్తృత ప్రచారం చేపడుతున్నారు. మండలంలోని రాయపర్తి, జేతురాం తండా గ్రామపంచాయతీ పరిధిలోని రావులతండాలకు చెందిన పలువురు అయ్యప్ప మాలధారులు శుక్రవారం పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్‌లోని హజ్రత్ సయ్యద్ యాకూబ్‌షావలీ బాబా దర్గాను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ఎర్రబెల్లి 7వ పర్యాయం విజయాన్ని వరించేలా దీవించాలని బాబాను అయ్యప్పలు వేడుకున్నారు. అయ్యప్ప మాలధారులు నేతావత్ రమేశ్‌నాయక్, మల్సూర్‌నాయక్, మొగిలినాయక్, వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



అన్నారం షరీఫ్ దర్గాలో పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు